కడప కార్పొరేషన్ పాలకవర్గం గడువు వచ్చే ఏడాది మార్చి నాటికి ముగియనుంది. కార్పొరేషన్ మేయర్‌గా సురేశ్‌బాబు ఉన్నారు. నిన్నటి వరకు ఆయన వైసీపీ జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. ఆయన మేయర్ పదవిపై ప్రభుత్వం అనర్హత వేటు వేసింది. జగన్‌కు కడప ఆయువుపట్టు లాంటిది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనం వైసీపీని చావుదెబ్బ కొట్టారు. అక్కడి నుంచి కోలుకోలేదు. జగన్ హయాంలో రూల్స్‌అనేది లేకుండా ఇష్టారాజ్యంగా వెళ్లిపోయారు. అప్పుడు జరిగిన తప్పులను ప్రస్తుత ప్రభుత్వం పరిశీలిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీలోకీ -రోల్‌గా ఉంటున్న సురేశ్‌బాబు పదవిపై వేటు పడడం వైసీపీలో ఆందోళన కలిగిస్తోంది.

జగన్‌కు ఝలక్..

- సొంత ఇలాకాలో భారీ దెబ్బ
- మేయర్ పదవి నుంచి సురేశ్‌బాబు తొలగింపు



- 14 రోజుల తరువాత అమలు చేయాలని జీవో జారీ
- కుటుంబ సభ్యుల పేరిట కాంట్రాక్టు పనులు చేసిన పర్యవసానం
- న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్న మేయర్
- హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాకపోతే ఇక మాజీనే
- వైసీపీలో ప్రకంపనలు.. టీడీపీలో జోష్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో మేయర్ సురేశ్‌బాబు, ఎమ్మెల్యే ఆర్.మాధవిల మధ్య జరిగిన కుర్చీ గొడవ కీలక దశకు చేరుకుంది. మేయర్ పక్కన కుర్చీ తీసివేయడంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెండు కార్పొరేషన్ పాలకమండలి సమావేశాల్లో కుర్చీ విషయమే హాట్‌టాపిక్‌గా మారింది. కుర్చీ విషయంపై ఎమ్మెల్యే మాధవి చాలా సీరియస్‌గా తీసుకున్నారు. నాకు కుర్చీ ఇవ్వవా.. అసలు నీకు కుర్చీ లేకుండా చేస్తా.. అంటూ తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించి అన్నంతపనీ చేశారు.

మేయర్ సురేశ్‌బాబు దాదాపు 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. సర్పంచ్‌గా, జడ్పీ వైస్‌ఛైర్మన్‌గా, మేయర్‌గా పనిచేశారు. జీహెచ్‌ఎంసీ-1955 యాక్ట్ ప్రకారం మేయర్ కుటుంబ సభ్యులు ఎవరూ కార్పొరేషన్ ద్వారా లబ్ధి చేకూరే పనులు చేయకూడదు. అయితే మేయర్ సురేశ్‌బాబు తన సతీమణి జయశ్రీ, కుమారుడు అమరేశ్‌లకు చెందిన వర్ధిని కన్‌స్ట్రక్షన్స్ పేరిట కాంట్రాక్టు పనులు చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధం. దీనిని ఎమ్మెల్యే అస్త్రంలా వాడుకున్నారు. ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా



కడప కార్పొరేషన్‌లో నేను మేయరుగా ఉంటే ఎమ్మెల్యే ఆర్.మాధవి పనులు జరగవనే ఉద్దేశ్యంతో నాపై కక్షగట్టారు. రూ.5లక్షల పనులు నా దృష్టికి, స్టాండింగ్ కమిటీ దృష్టికి రావు. నా కుటుంబ సభ్యులకు ఆ పనులు ఇస్తే అందుకు బాధ్యులు అధికారులు. వారిపై చర్యలు తీసుకోకుండా నాకు నోటీసులు ఇచ్చారు. నేను హైకోర్టును ఆశ్రయిస్తా. కోర్టులో న్యాయం జరుగుతుంది. కొత్త ప్రభుత్వం వచ్చి సంవత్సరం అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యే ఒక్కరూపాయి డబ్బులు తీసుకురాలేదు. కార్పొరేషన్ జనరల్ ఫండ్‌తో చేపట్టిన పనులు ప్రారంభిస్తూ తానే చేసినట్లు చెప్పుకుంటున్నారు.

\- మేయర్ సురేశ్‌బాబు

సురేశ్‌బాబుపై అనర్హత వేటు పడితే..

తనపై పడ్డ అనర్హత వేటుకు సంబంధించి మేయర్ సురేశ్‌బాబు హైకోర్టును ఆశ్రయించనున్నారని తెలిసింది. ఆయనకు అనుకూలంగా తీర్పురాకపోతే 41వ డివిజను కార్పొరేటరు, మొదటి డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంకు మేయర్ పదవి లభిస్తుందని చర్చ నడుస్తోంది.

విజిలెన్స్ విచారణలో వాస్తవాలు తేలడంతో సురేశ్‌బాబును మేయరు పదవి నుంచి తొలగిస్తూ మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి జీవో ఆర్‌టి నెం.446ను జారీ చేశారు. అయితే ఈ ఆర్డరును 14 రోజుల తరువాత అమలు చేయాలని సూచించారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని సురేశ్‌బాబు ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. న్యాయస్థానంలో సురేశ్‌బాబుకు అనుకూలంగా తీర్పురాకపోతే 14 రోజుల తరువాత ఆయన మాజీ కానున్నారు.

విజిలెన్స్ విచారణతో..

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు బృందం కార్పొరేషనులో విచారణ చేపట్టింది. వర్ధిని కన్‌స్ట్రక్షన్ సంస్థ చేపట్టిన పనులు, పూర్తి చేసిన పనులు పరిశీలించి. పూర్తయిన పనులకు రూ.33.65లక్షలు చెల్లింపులు చేశారు. జీహెచ్‌ఎంసీ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేసినట్లు విజిలెన్స్ గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు అంటూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మేయర్ సురేశ్‌బాబుకు మార్చినెల మూడో వారంలో నోటీసులు జారీ చేసింది. దీనిపై సురేశ్‌బాబు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఇచ్చిన గడువు పూర్తవడంతో మంగళవారం సురేశ్‌బాబు మున్సిపల్ శాఖ పీఎస్ కిశోర్‌కుమార్ ఎదుట హాజరై వివరణ ఇచ్చుకున్నారు. దీనికి సంతృప్తి చెందని ఆయన ఈ మేరకు మేయరుపై బుధవారం అనర్హత వేటు వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా మేయర్ సురేశ్‌బాబుపై వేటు పడిందనే విషయం వైసీపీలో ప్రకంపనలు సృష్టించింది. కడపలో పలువురు టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు.

అసలేం జరిగిందంటే..

కార్పొరేషన్, మున్సిపాలిటీలలో జీహెచ్‌ఎంసీ యాక్ట్-1955 అమలులో ఉంది. దీని ప్రకారం మేయర్‌తో పాటు స్థానిక సంస్థల పదవుల్లో నియమితులైన నాయకులు, కుటుంబసభ్యులు, బంధువులు ఎలాంటి కాంట్రాక్టు పనులు చేపట్టకూడదు. అయితే మేయర్ సురేశ్‌బాబు జీహెచ్‌ఎంసీ నిబంధనలు అతిక్రమించి తన సతీమణి, కొడుకు పేరిట ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్ పేరుతో కార్పొరేషన్‌లో రిజిస్టర్ చేసుకున్నారు.

- వర్ధిని కన్‌స్ట్రక్షన్ ద్వారా 12వ డివిజనులోని ఫక్కీరుపల్లెలో డోరు నెం.36/323-5-4 నుండి 36/323-7-5 వరకు రూ.లక్షతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.
- అదే డివిజనులో రూ.10లక్షలతో సంజన్న సర్కిల్ నుంచి వర్కాస్ కాంపౌండు గోడకు రివిట్‌మెంటు, సీసీ అప్రోచ్‌ను నిర్మించారు.
- శ్రీనగర్‌కాలనీలో రోడ్డు 2లో 12వ డివిజను వద్ద డోరు నెం.36/323-75 నుంచి 36/123-21-1-12 వరకు రూ.3.25లక్షలతో సిమెంటు రోడ్డు, రూ.3.90లక్షలతో బైపాస్‌లో పనులు చేపట్టారు.
- ఎకోపార్కు సమీపంలో రూ.4.96లక్షలతో మేజరు వాటర్‌స్ట్రోన్ డ్రైన్, కేఎస్‌నగర్ నుంచి నానాపల్లె వరకు రూ.4.92 లక్షలతో వాటర్‌స్ట్రోన్ డ్రైన్.. విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి పటేల్‌రోడ్డు, రాజీవ్‌మార్గ్‌రోడ్డులో, ఎస్‌బీఐ, హిమాలయా హాస్పిటల్ వరకు వాటర్‌స్ట్రోన్ డ్రైన్.. రూ.2.15లక్షలతో మాచుపల్లె బస్టాండు వద్ద పైపులైను పనులు చేపట్టారు.
- 4వ డివిజనులో చర్చి నుంచి బుడ్డాయపల్లె వరకు రూ.9.9లక్షలతో ప్యాచ్ వర్క్ పనులు, బుడ్డాయపల్లె సచివాలయ పరిధిలో రూ.9.9లక్షలతో పనులు అగ్రిమెంటు చేసుకున్నారు. వీటన్నిటిపై ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.

మహానాడుపై నారాలోకేశ్ సమీక్ష



నేతలతో మహానాడుపై నారా లోకేశ్ చర్చలు

కడప, మే 14(ఆంధ్రజ్యోతి): కడప గడపలో నిర్వహించనున్న మహానాడును టీడీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. జగన్ సొంత జిల్లా కడపలో కనులపండువగా అద్భుతంగా మహానాడు నిర్వహించాలని అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన మహానాడుపై మంగళగిరిలో టీడీపీ పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాసరావు, పలువురు మంత్రులతో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఇతర టీడీపీ నేతలు హాజరయ్యారు. మహానాడును విజయవంతం చేసేందుకు వివిధ బాధ్యతలను మంత్రులకు అప్పజెప్పారు. సమావేశంలో ప్రతి ఒక్కరికీ ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని లోకేశ్ సూచించారు. జగన్ హయాంలో మహానాడు నిర్వహించగా అడుగడుగుతునా అడ్డంకులు సృష్టించారు. ఈసారి కడపలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహానాడు నిర్వహించి సరికొత్త అధ్యాయం లిఖిద్దామంటూ నిర్ణయించారు.

మహానాడుకు పటిష్ఠ బందోబస్తు

- ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలి : ఎస్పీ



కడప క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న మహానాడు సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు అంశాలపై పోలీసు అధికారులకు దిశ నిర్దేశనం చేశారు. మహానాడుకు పలువురు వీవీఐపీలు, పెద్దఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పరంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా తీసుకోవాలనిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఇతర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, డీఎస్పీలు ఎన్.సుధాకర్, జి.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, భావన, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్‌రావు, అబ్దుల్‌కరీం, ఎస్‌బీ ఇన్‌స్పెక్టరు ఆర్.పురుషోత్తంరాజు, జిల్లాలోని సీఐలు పాల్గొన్నారు.

పాలీసెట్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్,మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ట్విట్టర్ వేదికగా ఫలితాలను విడుదల చేశారు. జిల్లాలో 7,271 మంది పరీక్ష రాశారు. వీరిలో 6,860 మంది (94శాతం) ఉత్తీర్ణత సాధించారు. జిల్లాకు చెందిన షేక్ ఖాదర్‌బాషా 119 మార్కులతో రాష్ట్రస్థాయిలో 23వ ర్యాంకు సాధించారు. అలాగే వెన్నపూస చంద్రకళ 118 మార్కులతో 72వ ర్యాంకు, మోపూరి శ్రావణకుమార్ 118 మార్కులతో 76వ ర్యాంకు సాధించారు.

కార్మికులకు వేతనాలు పెంపు : కలెక్టర్

కడప కలెక్టరేట్, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పనిచేసే దినసరి కార్మికులు, కాంటిన్‌జెంట్, ఎన్‌ఎంఆర్ కార్మికులకు వేతనాలు పెంచుతూ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం కలెక్టర్ చాంబరులో ఉపకార్మిక కమిషనర్ శ్రీకాంత్ నాయక్‌తో కలసి నిర్వహించిన సమావేశంలో కార్మికులకు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వేతనాల పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

మద్యం అనర్థాలపై అవగాహన కల్పించాలి

మద్యం తాగడం వల్ల వచ్చే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ అశోక్ కుమార్‌తో కలసి కలెక్టర్ కేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆల్కహాల్ వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో కేర్ కమిటీ ఏర్పాటైందన్నారు. మద్యం సేవించే వారికి దుష్పరిణామాలు తెలిసేలా మద్యం షాపుల్లో కరపత్రాలు అందజేయాలని ఆదేశించారు. బెల్ట్ షాపులపై గట్టి చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు, అసిస్టెంట్ కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డి, డీఈవో షంషుద్దీన్, డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు వేతనాలు పెంపుపై ఉత్తర్వులు జారీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి





ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో బాలుర మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

యమపాశంలా ఈత సరదా

- చెరువులోకి దిగి ఐదుగురు చిన్నారులు మృత్యువాత
- కనిపించని గుంతలే కడతేర్చాయా..?



మృతిచెందిన బాలురు తరుణ్‌యాదవ్, హర్షవర్ధన్, చరణ్, పార్థు (ఫైల్‌ఫొటోలు)

బద్వేలు / ప్రొద్దుటూరు / జమ్మలమడుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులలో ఈత సరదా పిల్లల పాలిట యమపాశంగా మారుతోంది. నిప్పుల కొలిమిలా మండుతున్న ఎండలలో వేసవితాపం తీర్చుకోవడం కోసం సరదాగా చెరువులు, కుంటలు, కాలువల్లోకి వెళ్లే చిన్నారులు ఈత రాతక నీటి లోతు తెలియక జలసమాధి అవుతున్నారు. తాజాగా మంగళవారం బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లె చెరువు ఐదుగురు చిన్నారుల పాలిట యమపాశమై నాలుగు గ్రామాలలో విషాదం నింపింది. ఈ విషాద ఘటనకు.. చెరువులో కనిపించని గుంతలే కారణమయ్యాయని తెలుస్తోంది. బెంగళూరు-విజయవాడ జాతీయ హైవే పనులకోసం మల్లేపల్లె చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి అక్రమంగా తరలించడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ విషయం తెలియని ఆ చిన్నారులు ఒకరినొకరు చేతులు పట్టుకుని కేరింతలు కొడుతూ సరదాగా చెరువులోకి దూకారు. చెరువులో లోతైన గుంతలు ఉండడంతో ఈతకోసం వెళ్లి ఇరుక్కుపోయి పైకి రాలేక మృత్యువాత పడినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అందరి మృతదేహాలను మంగళవారం రాత్రి 11గంటల సమయంలో చెరువునుంచి వెలికి తీశారు.

నాలుగు కుటుంబాలలో విషాదం

వేసవి సెలవులు ఉండడంతో సరదాగా గడపాలని తాత, అవ్వ ఊరికి వచ్చిన చిన్నారులు చెరువులో మృత్యువాత పడ్డంతో నాలుగు కుటుంబాల్లో విషాదం నెలకొంది. ఆ చిన్నారులపై మృతదేహాలపై పడి "రే కన్నా.. అమ్మ వచ్చింది పైకి లేరా" అంటూ రోదించిన తల్లులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. మల్లెపల్లె గ్రామం నుంచి మొత్తం ఏడుగురు ఈతకు వెళ్లగా ఇద్దరు వెనుతిరిగివెళ్లారు. దీంతో వారిద్దరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

ఉప్పలపాడులో ...


మల్లేపల్లె చెరువులో మంగళవారం సాయంత్రం గల్లంతై మృతిచెందిన అయిదుగురు బాలురలో జమ్మలమడుగు ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన దాదిబోయిన హర్ష (12) ఒకరు. బాలుడి మృతదేహాన్ని బుధవారం మధ్యాహ్నం ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చేర్చారు. మృతదేహం వద్ద మృతుడి తల్లి బోరున విలపించారు. 'బడికాడనే ఉంటానని ఎక్కడకు వెళ్లావురా..' అంటూ మృతదేహంపై పడి తల్లి రోదించార. దీంతో అక్కడికి చేరుకున్న మహిళలు కంటతడిపెట్టారు. ఉప్పలపాడులో దాదిబోయిన రామకృష్ణ, సావిత్రి దంపతులకు వివాహమైన 15 సంవత్సరాలకు లేక లేక కలిగిన సంతానం హర్ష. హర్ష పుట్టినరోజు జూన్ 11వ తేదీ జరగాల్సి ఉంది. వేసవి సెలవులకు అవ్వగారింటికి వెళ్లి శవంతో గ్రామానికి చేరుకున్నాడని పలువురు కంటతడిపెట్టారు. మధ్యాహ్నం బాలునికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగభద్ర హెచ్‌ఎల్‌సీ మాజీ ఛైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి దగ్గరుండి మృతదేహాన్ని తెప్పించడంతో పాటు అక్కడికి వచ్చిన బంధువులకు భోజనం ఏర్పాటు చేశారు. బ్రహ్మంగారి మఠం మల్లేపల్లె గ్రామానికి చెందిన గంగాధర్, రమ్యశ్రీ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ కుమారుడు దీక్షిత్ ఈతకెళ్లి మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. దీక్షిత్ అంత్యక్రియలలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు. కాగా.. ఐదుగురు చిన్నారులు మృత్యువాత పడడం అత్యంత విషాధకర సంఘటన అని, బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బాలుర కుటుంబ సభ్యులు, బంధువులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఆసుపత్రిలో మిన్నంటిన రోదన

మల్లేపల్లె చెరువు నుంచి ఐదుగురు బాలుర మృతదేహాలను మంగళవారం అర్థరాత్రి వెలికితీసి ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. బుధవారం ఉదయం బాలుర మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పోస్టుమార్టం గదిలో బాలుర మృతదేహాలను పట్టుకుని వారి తల్లిదండ్రులు, బంధువులు భోరున విలపించారు. మృతిచెందిన బాలురలో బిమఠం మండలం మల్లేపల్లెకు చెందిన గంగాధర్, రమ్యశ్రీ దంపతుల కుమారుడు దీక్షిత్ (12), నంద్యాల జిల్లా పెద్దబోధనంకు చెందిన సుబ్బయ్య, భవాని దంపతుల కుమారులు చరణ్ (15), పార్థు(12), జమ్మలమడుగు మండలం ఉప్పలపాడుకు చెందిన రామకృష్ణయ్య, సావిత్రిల కుమారుడు హర్షవర్ధన్ (12), కాశినాయన మండలం మల్లేరు కొట్టాలకు చెందిన నారాయణ కుమారుడు తరుణ్ యాదవ్ (10) ఉన్నారు. వీరందరూ సమీప బంధువులు. సెలవులకు మల్లేపల్లెకు వచ్చి ఈతకని వెళ్లి విగతజీవులుగా మారారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం ప్రత్యేక వాహనాల్లో స్వస్థలాలకు తరలించారు. ఆసుపత్రికి వచ్చిన ప్రజలు కూడా వసివాడని ఆ పసి బాలుర మృతదే హాలను చూసి కన్నీరు కార్చారు.

ఈసారైనా స్పందిస్తారా..?

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు
- దాహంతో అల్లాడుతున్న జనం
- గళం విప్పని ప్రజాప్రతినిధులు
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



జడ్పీ పాలకమండలి సర్వ సభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నారు. జడ్పీ చైర్మన్‌గా ముత్యాల రామగోవింద రెడ్డి ఇటీవలనే బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆధ్వర్యంలో మొదటిసారిగా జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎంతమేర చర్చ జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు నాలుగేళ్లుగా జడ్పీ సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగానే సాగుతూ వస్తున్నాయి. ఈసారైనా ప్రజా సమస్యలపై నేతలు గళం విప్పుతారని జనం ఆశగా ఎదురుచూస్తున్నారు.

కడప రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధీనంలోని జడ్పీ పాలక మండలి ఇప్పటి వరకు జడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఇన్‌చార్జి జడ్పీ చైర్‌పర్సన్ జె.శారద ఆధ్వర్యంలో దాదాపు 16 జడ్పీసర్వ సభ్య సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలను అరకొర చర్చలతోనే ముగించేశారు. నేడు ముచ్చటగా మూడవ జడ్పీ ఛైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి ఆధ్వర్యంలో జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేథప్యంలో జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించి పరిష్కారం చూపాలని జనం కోరుతున్నారు.

అకాల వర్షాలతో నష్టం..

జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఉద్యాన పంటలతో పాటు వ్యవసాయ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఈ కారణంగా అరటి, బొప్పాయి, మామిడి, మునగ, కర్బూజ, దోస, వరి, నువ్వు తదితర పంటలకు రూ.వందల కోట్లలో నష్టం వాటిల్లింది. బాధిత రైతులు లబోదిబో మంటున్నారు. వీరిని ఆదుకొనేలా చర్చ సాగించాల్సిన అవసరం ఉంది.

దాహం నుంచి గట్టెక్కిస్తారా

ఎండలు మండిపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో 40 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అటు సాగునీటికి రైతులు ఇబ్బంది పడుతుండగా ఇటు తాగునీటికి ప్రజలు ఇక్కట్ల పాలవుతున్నారు. మరో పక్క

మిగతా 6వ పేజీలో..

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవా.. రామా...!

- ఇబ్బందులు పడుతున్న రామ భక్తులు
- ఒంటిమిట్టలో రైళ్లు ఆపాలంటూ వినతులు

ఒంటిమిట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో రామభక్తులు అవస్థలు పడుతున్నారు. రాష్ట్రం విడిపోవడంతో 2015లో ఒంటిమిట్ట కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆలయ అభివృద్ధి కొరకు ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం చేసింది. టీటీడీ వారు 100 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఒంటిమిట్ట కోదండరాముడి దర్శనానికి విచ్చేస్తున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేస్తున్నారు. కానీ ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒంటిమిట్ట మీదుగా పలు రాష్ట్రాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటిలో కొన్ని రైళ్లు అయినా ఒంటిమిట్టలో నిలిపితే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం ఒంటిమిట్ట రైల్వేస్టేషన్‌లో అరక్కోణం, హుబ్లీ, డెమో ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి ఒంటిమిట్ట కోదండరాముడి దర్శనానికి విచ్చేయాలంటే రైళ్ల సౌకర్యం లేకపోవడంతో పలువురు భక్తులు రాలేకపోతున్నారు. ప్రతిరోజూ సుమారు 10 వేల లోపు భక్తులు కోదండరాముడిని దర్శించుకుంటున్నారు. రైళ్ల సౌకర్యం ఏర్పడితే భక్తుల తాకిడి ఇంకా పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జరిగిన కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతిరోజూ ఐదు వేలకు మందికి పైగా ఒంటిమిట్టలో ఆగే రైళ్లల్లో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో రైల్వే శాఖకు సుమారు 1.50 లక్షల రూపాయలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదే ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ ఆగితే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఒంటిమిట్ట మండలంలో ప్రధానంగా రైతులు చీనీ, నిమ్మ పంటలను సాగు చేస్తున్నారు. ఈ పంటలను రైతులు కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులంకు పంపిస్తూ ఉంటారు. వ్యాపార లావాదేవీల కోసం ఇక్కడ రైతులు ఎర్నాకులానికి వెళుతుంటారు. అలాగే చెన్నై, విజయవాడ తదితర ప్రాంతలకు కూడా ఈ పంటను పంపిస్తున్నారు. రైళ్ల స్టాపింగ్ లేకపోవడంతో వీరంతా చాలి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరు చెన్నై, విజయవాడ, హైదరాబాదు, కాకినాడ, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వ్యాపార నిమిత్తం వెళుతుంటారు. వీరు కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పది సంవత్సరాలుగా ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని పలువురు భక్తులు రైల్వేశాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రామ భక్తులు, రైతులు, చేనేత కార్మికులు కోరుతున్నారు.




ఒంటిమిట్ట రైల్వేస్టేషన్

రాముడి దర్శనం ఎంతోమందికి దక్కుతుంది



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపితే కోదండరాముని దర్శనం ఎంతోమందికి దక్కుతుంది. రాముడిని దర్శించుకోవాలని ఉన్నా వచ్చేందుకు రైళ్ల సౌకర్యం లేకపోవడంతో దూర ప్రాంత గ్రామ భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాము.

- బొబ్బిలి సుబ్బరాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఒంటిమిట్ట

భక్తులకు ఇబ్బందులు తప్పుతాయి



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగితే రామ భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. రైల్వే అధికారులు దీనిపై దృష్టి సారించి రైళ్లు ఆగేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- వీణా రాఘవాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు

రైతులకు ఎంతో ఉపయోగం



ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగితే మండల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కేరళ, చెన్నై, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఇక్కడి రైతులు వ్యాపారం కోసం వెళుతుంటారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

- కట్టా యానాదయ్య, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు

భక్తుల కోసం ఆపాలి



ఒంటిమిట్ట కోదండరామ స్వామిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తుల కోసం ఒంటిమిట్టలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి. రైళ్లు నిలిపితే ప్రతి ఒక్కరికీ సౌకర్యంగా ఉంటుంది. భక్తుల తాకిడి కూడా పెరిగే అవకాశం ఉంటుంది

- ఎస్వీ రమణ, ప్రముఖ కాంట్రాక్టర్, ఒంటిమిట్ట

స్కూల్ అసిస్టెంట్లను డిమోషన్ చేయడం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

మదనపల్లెటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లను డిమోషన్ చేసి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా మార్చడం సరికాదని ఏపీ ఉపాధ్యాయుల సంఘం (ఏపీఏఎస్) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ విమర్శించారు. బుధవారం స్థానిక ఆపస్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 19 ప్రకారం మిగులు స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా మార్చడం అవమానపరిచినట్లు ఉందన్నారు. ఈ జీవో అసంబద్ధంగా ఉందని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఆపస్ నాయకులు రెడ్డి రాజేశ్వరి, రెడ్డిశేఖర్, సిద్ధారెడ్డి, రమణ, కొండారెడ్డి, గిరీష్, గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో మదనపల్లె విద్యార్థికి జిల్లా ఫస్ట్ ర్యాంకు


కార్తీక్

మదనపల్లె టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మికుడు వెంకటసుబ్బయ్య, శైలజ కుమారుడు బి.కార్తీక్ 117/120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 188వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించగా అందులో కార్తీక్ 188వ ర్యాంకుతో జిల్లాలో ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఎం.రెడ్డిరచన 117/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 277 ర్యాంకు, ఒ.మహ్మద్ అఫ్రాన్ 114/120 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 601 ర్యాంకు సాధించాడు. ఇదిలా వుండగా జిల్లా వ్యాప్తంగా 3981 మంది పాలిసెట్ పరీక్షకు హాజరు కాగా వీరిలో 3,768 మంది అర్హత సాధించారు.

ఘనంగా మహా చండీ హోమం


రెడ్డెమ్మకొండలో మహా చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుర్రంకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహాకుంబాభిషేకం మహోత్సవంలో భాగంగా బుధవారం మహాచండీ హోమాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు ఉదయాన్నే దేవత ఉత్థాపనం, పంచామృత స్నపనం, దీక్షా హోమం, యంత్రప్రతిష్ఠ, మూలమంత్రహననం, వాస్తు హోమం, మహా చండీహోమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. వారికి తీర్థప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాలను చేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌నాయుడు, సర్పంచ్ ప్రేమకుమారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష


నిందితుడు ఆదినారాయణరాజు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి 5 సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు ఇచ్చిందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. పీలేరు మండలం మారంరెడ్డిగారిపల్లె ఎర్రగుంట్లపల్లెకు చెందిన అరవ వెంకట ఆదినారాయణరాజు 2021 సంవత్సరం జనవరి 11వ తేదీ రాత్రి 7 గంటల ప్రాంతంలో ఎర్రచందనాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో అప్పటి వాల్మీకిపురం ఎస్ఐ వెంకటేశ్వర్లు వాహనాలు తనిఖీ చేసి ముగ్గురు నిందితులను పట్టుకున్నారన్నారు. ఎస్ఐ సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించగా ప్రస్తుతం ముగ్గురు నిందితుల్లో గుండ్లూరు చెంగల్‌రెడ్డి, దళారి నారాయణరాజులు కేసు విచారణ జరుగుతుండగా అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. నిందితుడు వెంకట ఆదినారాయణరాజుపై విచారించిన జిల్లా అడిషనల్ న్యాయమూర్తి నరసింహమూర్తి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు.

ఈసారైనా స్పందిస్తారా..?

- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు
- దాహంతో అల్లాడుతున్న జనం
- గళం విప్పని ప్రజాప్రతినిధులు
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

(5వ పేజీ తరువాయి)

మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. పశువుల దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటుచేస్తున్న తాగునీటి తొట్టెల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

గిట్టుబాటు ధర కల్పిస్తారా..

రబీలో సాగుచేసిన వరి పంటల నూర్పిళ్లు దాదాపు పూర్తై ధాన్యాన్ని రైతులు అమ్ముకుంటున్నారు. పంటకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. పైగా వ్యాపారులు తూకంలో దగా చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వీటికి పరిష్కారం చూపాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది.

ఖనిజ దోపిడీని అరికట్టేనా..

జిల్లాలో ఖనిజదోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ముగ్గురాయి, సున్నపురాయి, గ్రావెల్, మట్టి తదితర వాటిని అన్ని పార్టీల వారూ అక్రమంగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అనుమతులు లేకుండానే కొండలను, గుట్టలను తవ్వి గుల్లచేస్తున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ఈ అక్రమాలకు కళ్లెం వేయాల్సిన అవసరం ఉంది.

శాఖల వారీగా..

- పశుసంవర్ధకశాఖలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. అధికారులు అందుబాటులో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024-25కు గాను ఉమ్మడి జిల్లాకు 875 గోకులం షెడ్లను మంజూరు చేసింది. వీటిలో చాలా వరకు అనర్హులు నిర్మించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశుగ్రాస విత్తన సరఫరా అంతంతమాత్రమే సాగుతోంది. పెయ్యదూడల సంఖ్య పెంపు గణాంకాలకే పరిమితమవుతోంది. వీటిపై చర్చించాల్సిన అవసరం ఉంది.
- జిల్లా స్త్రీ, శిశుసంక్షేమశాఖ ద్వారా జిల్లాలో సాగుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు బాలారిష్టాలు పట్టుకున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు నాణ్యతా లోపంగా కొనసాగుతున్నాయి. బాల సంజీవని పథకం కిట్స్ పక్కదారి పడుతున్నాయి.
- పంచాయతీరాజ్‌శాఖలో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు, కాంపౌండ్ వాల్ తదితర మొత్తం 999 పనులను రూ.8,017.21 లక్షలతో ప్రారంభించారు. వాటి బిల్లులతో పాటు ఉపాధి హామీ పథకం ఫేజ్ 1, 2, 3 కింద చేపట్టిన పలు పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతుండంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు.
- పంచాయతీశాఖ పరిధిలోని చాలా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. 2024-25కు గాను 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలోని 16 పంచాయతీల్లో దాదాపు రూ.3 కోట్లను పక్కదారి పట్టించారు. పన్ను వసూళ్లలో సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వేతనాలను సక్రమంగా చెల్లించలేదని క్లాప్ మిత్రలు ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చ సాగించి పరిష్కారం చూపుతారని జనం గంపెడాశతో ఎదురుస్తున్నారు.

అప్రమత్తం చేసేందుకే మాక్‌డ్రిల్


బస్టాండులో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపకశాఖాధికారులు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): యుద్ధం అనివార్యమైనప్పుడు ప్రజలు ఏ విధంగా దానిని ఎదుర్కోవాలో తెలిపేందుకే అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో సివిల్ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం రాయచోటిలోని ఆర్టీసీ బస్టాండులో రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖల ఆధ్వర్యంలో సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. శత్రుదేశం నుంచి మన దేశంలోని ఏ ప్రాంతం మీదైనా దాడి జరిగినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేసేందుకే ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ యుద్ధం వచ్చినప్పుడు ప్రజలు తమని తాము ఎలా రక్షించుకోవాలి అని తెలియజెప్పే కార్యక్రమమే సివిల్ మాక్ డ్రిల్ అని చెప్పారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ సివిల్ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు సైరన్ మోగించి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఉషశ్రీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

పీలేరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కడప ఆర్జేడీ ఎ.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఆయన పీలేరు ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు, విద్యార్థులకు అందించాల్సిన మౌలిక వసతులు తదితర ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఆర్జేడీ వెంట ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్లు వై.వెంకటరెడ్డి, బి.రెడ్డెప్ప, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యుడు నాగ సురేష్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యుడు భాస్కర్, డిపార్ట్‌మెంటల్ అధికారులు వెంకటరమణ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో నేరగాళ్లను గుర్తించండి

శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యంతో నేరగాళ్లను గుర్తించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్ల ఎత్తుగడలకు అడ్డుకట్ట వేస్తూ జిల్లాలో నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్ష్యాధారాల సేకరణ, వాటి భద్రతా ప్రమాణాలు ఎలా పాటించాలనే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని తెలియజేశారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో గల అన్ని విభాగాలకు సంబంధించి నిష్ణాతులైన వారితో ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట సబ్ డివిజన్ ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, విజయవాడ ఫోరెన్సిక్ నిపుణులు కిరణ్‌కుమార్, మురళి, అనంతపురం ఆర్ఎఫ్ఎస్ఎల్ అధికారులు జయరాజు, కుళాయమ్మ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు, కెరీర్ కౌన్సెలింగ్ తరగతులు

రాయచోటి, మే 14 (ఆంధ్రజ్యోతి): పినాక ప్రజా సాధికార ట్రస్టు, ఐఆర్ఎస్ అధికారి బి.యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం నుంచి జూన్ 4వ తేదీ వరకు 21 రోజులపాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కెరీర్ కౌన్సెలింగ్, జీవన నైపుణ్యాలు, పర్సనాలిటీ డెవెలప్‌మెంట్ తరగతులను రాయచోటి, మదనపల్లె పట్టణాల్లో నిర్వహించనున్నారు. ఈ తరగతుల్లో బి.యాదగిరి 'జీవన నైపుణ్యాలు, సివిల్ సర్వీస్ పరీక్షల తయారీకి దిశానిర్దేశం, డిబేట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి' అనే అంశాలపై బోధిస్తారు. మానసిక వ్యక్తిత్వ వికాస శిక్షకులు, పినాక సీఈవో కొల్లి రాజారాం విద్యార్థులకు తరగతులు తీసుకుంటారు. వీరితో పాటు జీవితంలోని వివిధ రంగాలలో విజయం సాధించిన వ్యక్తులు తమ అనుభవాలను వివరిస్తారు. అనుభవజ్ఞులైన శిక్షకులతో స్పోకెన్ ఇంగ్లీష్, కాంపిటీటివ్ ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తారు. డిగ్రీ, పీజీ, బీటెక్ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ఆవరణలో ఈ తరగతులు నిర్వహిస్తారు. టీవీ-45 ఛైర్మన్ వలిగట్ల రెడ్డెప్ప చీఫ్ ప్యాట్రన్‌గా, లలితకుమారి, రేణుక, రెడ్డెప్పలు డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు.

రాయచోటి పట్టణంలోని శ్రీషిరిడీ సాయి మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగే తరగతులకు ముఖ్య ప్యాట్రన్‌గా రాయచోటి కీస్ సొసైటీ, కె.రఘునాథ, గౌనిపల్లె శివ డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజూ తరగతులు జరుగుతాయి. ప్రతి సెంటర్‌లో 100 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు మధ్యాహ్న భోజనం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి : మంత్రి

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలను అందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో రూ.10 లక్షలతో రీమోడల్ చేసిన ఎస్ఈ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన విద్యుత్ అందిస్తోందన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. విద్యుత్ అధికారులకు ఎటువంటి సమస్యలున్నా వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. జిల్లా ఏర్పడిన అనంతరం రాయచోటి పట్టణంలో ఏపీఎస్పీడీసీఎల్ నూతన ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేశామని, నూతన ఎస్ఈ ఛాంబర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్ఈ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

31 మంది ఎస్ఐల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంతో పాటు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న 31 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో ఉన్న విష్ణువర్థన్‌ను రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1గా, ఇక్కడ పనిచేస్తున్న నరసింహారెడ్డిని జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోని సైబర్ క్రైమ్ ఎస్ఐగా, రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా పనిచేస్తున్న మహమ్మద్ అబ్దుల్ జహీర్‌ను జిల్లా హెడ్ క్వార్టర్‌లోని డీఎస్‌బీ ఎస్ఐ-1గా, పీలేరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ-2గా ఉన్న లోకేశ్‌ను రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న బాలాజీనాయక్‌ను పీలేరు అర్బన్‌స్టేషన్ ఎస్ఐ-2గా, సైబర్ క్రైమ్ ఎస్ఐగా ఉన్న టీవీఎస్ చిరంజీవిని వీరబల్లి ఎస్ఐగా, వీరబల్లి ఎస్ఐమోహన్‌నాయక్‌ను సీసీఎస్ ఎస్ఐ-3గా, వీఆర్‌లో ఉన్న మల్లికార్జునరెడ్డిని నందలూరు ఎస్ఐగా, గుర్రంకొండ ఎస్ఐ మధురామచంద్రుడును డీసీఆర్బీ ఎస్ఐ-1గా, వీఆర్‌లో ఉన్న వెంకటేశ్‌ను రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1గా, వీఆర్‌లో ఉన్న రాందాస్‌ను రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే రాజంపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ1గా ఉన్న లక్ష్మీప్రసాద్‌రెడ్డిని రైల్వేకోడూరు అర్బన్ ఎస్ఐగా, రైల్వేకోడూరు అర్బన్ ఎస్ఐ నవీన్‌బాబును గుర్రంకొండ ఎస్ఐగా, డీసీఆర్బీ ఎస్ఐగా ఉన్న శివకుమార్‌ను పుల్లంపేట ఎస్ఐగా, డీసీఆర్బీ ఎస్ఐ-2గా ఉన్న అన్వర్‌బాషాను మదనపల్లె వన్‌టౌన్ పీఎస్ ఎస్ఐ-2గా బదిలీ చేశారు.

మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ2గా పనిచేస్తున్న శ్రీనివాస్‌నాయక్‌ను రాయచోటి ఉమెన్స్ పీఎస్ ఎస్ఐ-3గా, వీఆర్‌లో ఉన్న బాలరాజును ఉమెన్స్ పీఎస్ ఎస్ఐ-4గా, మదనపల్లె అర్బన్ తాలూకా పీఎస్‌లో ఎస్ఐ-2 చంద్రమోహన్‌ను మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1, మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1 హరిప్రసాద్‌ను పీటీఎం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-1గా, మదనపల్లె తాలూకా ఎస్ఐ-1 హరిహరప్రసాద్‌ను పీటీఎం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా, మదనపల్లె టూటౌన్ ఎస్ఐ-2 గాయత్రిని మదనపల్లె తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2గా బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న శ్రీనాథ్ ప్రసాద్‌ను మదనపల్లె టూ టౌన్ ఎస్ఐ-2గా, పీటీఎం ఎస్ఐ రవికుమార్‌ను రామసముద్రం ఎస్ఐగా, వీఆర్‌వోలో ఉన్న ఉమామహేశ్వరిని తంబళ్లపల్లె ఎస్ఐగా, వీఆర్‌లో ఉన్న వెంకటేశ్వర్లును పెద్దమండెం ఎస్ఐగా, డీఎస్ఈ ఎస్ఐ-1గా ఉన్న శ్రీనివాసులరెడ్డిని అన్నమయ్య డీఎస్‌బీ ఎస్ఐ-2గా బదిలీ చేశారు. అలాగే పెద్దమండెం ఎస్ఐగా ఉన్న పీవీ రమణను డీఎస్‌బీ ఎస్ఐ-3గా, వీఆర్‌లో ఉన్న సూర్యనారాయణను డీఎస్‌బీ ఎస్ఐ-4గా, వీఆర్‌లో ఉన్న సుబ్రమణ్యం నాయక్‌ను డీఎస్‌బీ ఎస్ఐ-5గా, వీఆర్‌లో ఉన్న జయరామప్పను డీసీఆర్‌బీ ఎస్ఐ-2గా వీఆర్‌లో ఉన్న శివకామినీని పీసీఆర్ ఎస్ఐ-2గా నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వారికి కేటాయించిన పోలీస్‌స్టేషన్‌లలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

వైభవంగా రథోత్సవం



వెల్లాలలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం

రాజుపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథాన్ని ప్రత్యేక పూల అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాల అనంతరం రథంపై ఉత్సవ విగ్రహాలను కూర్చోబెట్టి ఊరేగింపు మొదలుపెట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఆలయ ఈవో వెంకటరమణ, ఆలయ కమిటీ జీఎల్ నారాయణరెడ్డి, టీడీపీ నాయకులు తోట మహేశ్వర్‌రెడ్డి, మండల టీడీపీ నాయకులు చెమికల పురుషోత్తంరెడ్డి తదితరులు ప్రారంభించారు. మాడవీధుల్లో రథంపై ఊరేగుతున్న స్వామివారి దర్శనానికి తరలివచ్చిన

● జనసంద్రమైన వెల్లాల క్షేత్రం

భక్తులతో వెల్లాల పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. రథోత్సవానికి హాజరైన భక్తులకు పది చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం 3.30గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కడప ఎద్దులకు ప్రథమ బహుమతి

వెల్లాల చెన్నకేశవ సంజీవరాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్రస్థాయి సీనియర్ వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ తోట మహేశ్వ ర్‌రెడ్డి, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు ప్రారం భించారు. ఈ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబులరెడ్డి ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచి రూ.1.11 లక్షలు గెలుపొందాయి. రెండో స్థానంలో బోరెడ్డి కేశవరెడ్డి పెద్దకొట్టాల, సుంకి సురేందర్‌రెడ్డి ఎద్దు రెండో బహుమతి రూ.75 వేలు, మూడో స్థానంలో నంద్యాల జిల్లా గుంపుర మండిన్నె కందుకూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్లకు రూ.50 వేలను కమిటీ సభ్యులు అందించారు.



బహుమతులు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్ఏయూ 12 విభాగాలకు ఏఐసీటీఈ అనుమతి

కడప ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి 12 టెక్నికల్ విభాగాలన్నింటికి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నుంచి అనుమతి పొడిగింపు పొందినట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. 2023లో మొదటిసారిగా లెటర్ ఆఫ్ అప్రూవల్ పొందిన ఈ విశ్వవిద్యాలయం ప్రతి సంవత్సరం అనుమతిని విజయవంతంగా పొందుతోందన్నారు. టెక్నికల్ విద్యలో తన అంకితభావాన్ని నిరూపించుకున్నట్లు స్పష్టం చేశారు. అనుమతి పొందిన విభాగాలలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ), కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (సీఎఫ్ఏ) రెండూ ఉన్నాయన్నారు. ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఫెసిలిటీస్ అండ్ సర్వీసెస్ ప్లానింగ్, గేమ్ డిజైన్ టెక్నాలజీస్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఇంటీరియర్ డిజైన్, ఫైన్ ఆర్ట్స్ ప్రోగ్రాములు, అప్లైడ్ ఆర్ట్, ఆనిమేషన్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఫొటోగ్రఫీ విభాగాలు ఉన్నాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి పై 12 ప్రోగ్రాములకు ఏడీసెట్, ఈఏపీసెట్ ద్వారా ప్రవేశాలు పొందుటకు మార్గం సుగమం కానుందన్నారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.వైఎస్ఆర్ఏఎఫ్‌యూ.ఏసీ.ఇన్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ
అక్రమాలపై ఉదాసీనత

● ఆరుగురు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు నోటీసులు

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేయడం, అనంతరం కట్టడాల తీరుతెన్నులను పర్యవేక్షించడం కారణంగా జరిగిన అక్రమాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనత చూపించిన వ్యవహారం చివరికి రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని ఆరుగురు అధికారుల మెడకు చుట్టుకుంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో నివాస కట్టడాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలు, విద్యా సంస్థల భవనాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. అందుకు బాధ్యులైన ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అధికారులపై చర్యలు తీసుకోవడానికి సిఫారసులు అందాయి. అభియోగాలు నమోదైన వారిపై చర్యలకు ఉపక్రమించకుండా రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో పనిచేసే ఆరుగురు అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారని గుర్తించారు. ప్రస్తుతం అక్రమార్కుల విషయాలు అటుంచితే ఉదాసీనంగా వ్యవహరించి చర్యలు తీసుకోవడానికి అడ్డుపడ్డ అధికారులకు ప్రభుత్వం బుధవారం నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా అభియోగాలపై పూర్తి వివరణలు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇలా నోటీసులు జారీ చేయబడిన వారిలో రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ సి సెక్షన్ సూపరింటెండెంట్, ప్రస్తుత వడ్డేశ్వరం మున్సిపల్ కమిషనరు జి.రమణారెడ్డి, ప్రస్తుత బాపట్ల మున్సిపల్ కమిషనర్ అప్పటి ఎంఏయూడీ సూపరింటెండెంట్ జి.రఘునాథరెడ్డి, ప్రస్తుతం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనరు ఆర్‌జీవీ కృష్ణ, ప్రస్తుతం సెవులో ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ సత్యనారాయణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలోని ఏ1 సహాయకులు షాలినీ దేవి, కె.ఇందిర వున్నారు. అక్రమార్కులను కాపాడబోయి వీరంతా అభియోగాలకు గురయ్యారని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆరుగురికి విడివిడిగా నోటీసులు జారీ చేశారు.

బద్వేలు మున్సిపాలిటీ అక్రమాల్లో 8 మందిపై విచారణ

కలికిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో ఐదుగురు ఇంజినీర్లతోపాటు మరో ముగ్గురు అధికారులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అనంతపురం సర్కిల్ ప్రజారోగ్య సూపరింటెండింగ్ ఇంజినీరు ఆర్.రామమోహన్ రెడ్డిని విచారణాధికారిగా నియమించగా ఆయన సహాయకారిగా అవసరమైన రికార్డులను సమకూర్చడానికి కడప ప్రజారోగ్య ఎక్జిక్యూటివ్ ఇంజినీరును నియమించింది. బద్వేలు మున్సిపాలిటీలో సమగ్ర తాగునీటి సరఫరా అభివృద్ధి పనుల్లో చోటు చేసుకున్న అనేక అక్రమాలు, అవకతవలపై విజిలెన్స్ విచారణ చేపట్టి 2023 డిసెంబరు 5న ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ అక్రమాల్లో బద్వేలు మున్సిపాలిటీలో అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆర్.నగేష్‌బాబు, డిప్యూటీ ఈఈ కె.గురప్ప యాదవ్, మరో డీఈఈ పి.తులసికుమార్, ఏఈ జి.వరప్రసాద్, టెక్నికల్ ఆఫీసర్ జి.రమేష్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ వేముల జ్యోతి, మరో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసరు ఎల్.గోవిందనాయక్, రిటైర్డు ఈఈ డి.శివనాగేంద్రల భాగస్వామ్యం ఉన్నట్లు విజిలెన్స్ తేల్చింది. ఈ విచారణ మేరకు వీరందరినీ అక్రమాలకు బాధ్యులుగా నిర్ధారిస్తూ విచారణ జరగనుంది. ఈ మేరకు మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

18న జాతీయస్థాయి బండలాగుడు పోటీలు

జమ్మలమడుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో 18వ తేదీ జాతీయస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 18వ తేదీ ఉదయం 7.30 గంటలకు న్యూ కేటగిరి విభాగంలో, 19వ తేదీ ఉదయం సీనియర్స్ విభాగం ఎడ్లకు బండలాగుడు పోటీలు ఉంటాయని తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



వేలిముద్ర నమూనాలను సేకరిస్తున్న క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్

ముద్దనూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వన్‌ఇండియా ఏటీఎంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి యత్నించారు.పోలీసుల వివరాల మేరకు... బుధవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం గదిలో కారంపొడి చల్లి క్యాష్ బాక్సు ఉన్న డోరును తెరిచారు. అయితే క్యాష్ బాక్సును తెరవడంలో విఫలమయ్యారు. సమాచారం అందిన వెంటనే సీఐ దస్తగిరి పోలీసు సిబ్బందితో కలసి ఏటీఎం వద్దకు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ రుక్మిణీదేవి ఏటీఎంను పరిశీలించి, పరీక్ష కోసం వేలిముద్రల నమూనాలను సేకరించినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం




ముద్దనూరు మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రహదారిలోని పులికోన మలుపు సమీపంలో బుధవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం అయ్యింది. స్థానికుల సమాచారం మేరకు... కొండాపురం మండలానికి చెందిన అహమ్మద్‌బాషా కారులో ముద్దనూరు మీదుగా నంద్యాలకు వెళుతున్నాడు. ఘాట్‌లో పులికోన మలుపు సమీపంలో కారు ఏసీలో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. దీంతోమంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చిమంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే కారు పూర్తి గా కాలిపోయింది. అయితే కారులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

18 టన్నుల చీనీకాయలు చోరీ

కొండాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లావనూరు గ్రామంలో తోటల్లోని చీనీకాయలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడురోజుల కిందట ఉమామహేశ్వరరెడ్డి అనే రైతు తోటలోని 12 టన్నుల చీనీకాయలు, లక్ష్మిరెడ్డి అనే రైతు తోటలోని 6 టన్నుల చీనీకాయలను రాత్రిపూట చెట్ల నుంచి కోసుకెళ్ళినట్లు రైతులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.6లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన గంగరాజు

కలసపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లారెడ్డి పల్లెకు చెందిన గంగరాజు (25) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం గంగరాజు తన సొంత పనిపై ద్విచక్ర వాహనంలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు వెళ్తుండగా సంజీవరాయుని పేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్ల కుమారుడు ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



ప్రొద్దుటూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులోని సినీహబ్ ఎదుట గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. బుధవారం ఉదయం స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 60 నుంచి 65 ఏళ్లలోపు ఉండవచ్చని, లైట్ బ్లూగళ్ల చొక్కా, పట్టెల లుంగీ ధరించి వున్నాడని తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే రూరల్ సీఐ, ఎస్ఐలు 9121100597, 9121100598, 9121100599 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



వల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తప్పెట్ల గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుగ్గాయపల్లె వెంకటాపురం గ్రామానికి చెందిన బాబాఫకృద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తన సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో కడపకు వెళుతుండగా కడప నుంచి కమలా పురం వైపు వస్తున్న లారీ ఢీకొనంతో రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో కమలాపురం వైపు నుంచి కడపకు వెళుతున్న మరో లారీ అతని కాళ్లపై ఎక్కింది. దీంతో కాలు విరిగి రక్తగాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు సీఎంసీకి తరలించినట్లు వారి బంధువులు తెలిపారు.

మహిళపై హత్యాయత్నం కేసులో.. ఐదేళ్లు జైలుశిక్ష, రూ.70వేలు జరిమానా

కడప క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): తనకు డబ్బులు ఇవ్వకుండా నిరాక రించిన ఓ మహిళపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.70వేలు జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ బి.రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సిద్దవటం మండలం మంగనవండ్ల గ్రామానికి చెందిన కారుమంచి సురేశ్ అనే వ్యక్తి తన అక్క వరుసైన సులోచన అనే మహిళ వద్ద అప్పుడప్పుడూ డబ్బులు తీసుకుం టుండేవాడు. ఈ క్రమంలో 2020 ఫిబ్రవరి 2న సులోచనను డబ్బులు ఇవ్వమని అడగ్గా ఆమె నిరాకరించింది. దీంతో ఆమెను బూతులు తిట్టి తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేసి తలపై, కుడిచేతిపై గాయపరిచాడు. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి కడప వన్‌టౌన్ ఎస్‌ఐ బి.మధుసూదనరెడ్డి విచారణ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు విషయమై బుధవారం కడప అడిష నల్ ఏఎస్‌జె కోర్టు జడ్జి నిందితుడికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.70 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కాగా సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్షపడేలా చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించారు.

రాళ్లదాడిలో యువకుడు మృతి

చక్రాయపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి గ్రామం కోమటిపేటకు చెందిన కందుల చంటి (30) అనే యువకుడిపై సురభి హరిజనవాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు మంగళవారం రాత్రి రాళ్లతో దాడి చేయడంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... కోమటిపేటకు చెందిన కందుల చంటి సురభిహరిజన వాడకు చెందిన దర్శనమ్మతో చనువుగా ఉండటం చూసి రమణ, కుమార్, ఈశ్వరయ్యలు ఓర్వలేకపోయారు. ముగ్గురు కలసి చంటిని చంపాలని పథకం పన్నారు. ఈ నేపథ్యంలో చంటి ప్రతి నిత్యం ట్రాక్టర్‌తో బొగ్గుల బట్టీల కోసం వేంపల్లె వైపు కట్టెలు తోలుతూ ఉంటాడు. మంగళవారం రాత్రి కట్టెలు విడిచి తిరిగి వస్తుండగా దేవరగుట్టపల్లె సమీపాన రమణ, కుమార్, ఈశ్వరయ్య రాళ్లతో దాడి చేయగా చంటి అక్కడే పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు వారి బంధువులకు ఫోన్ ద్వారా తెలపడంతో హుటాహుటిన వచ్చి వేంపల్లెకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించగా మృతి చెందాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

విధులకు వెళ్తున్నానని చెప్పి ఆర్మీ ఉద్యోగి అదృశ్యం



నాగార్జునరెడ్డి (ఫైల్)

కలసపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బైరెడ్డి నాగార్జునరెడ్డి అనే ఆర్మీ ఉద్యోగి గత నెల 1న విధులకు వెళ్తున్నట్లు చెప్పి అదృశ్యమయ్యాడు. ఉత్తరాఖండ్ రాష్ట్ర రేంజ్ ఆర్మీ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న అతను సెలవుపై ఫిబ్రవరి నెలలో తన స్వగ్రామమైన ముదిరెడ్డిపల్లెకు వచ్చాడు. సెలవుల అనంతరం ఏప్రిల్ 1న తిరిగి విధులకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. మీ అబ్బాయి విధులకు రాలేదని పనిచేస్తున్న ప్రాంతం నుంచి అధికారులు ఫోన్ చేయడంతో ఎక్కడికి వెళ్లాడోనని తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. తండ్రి నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కలసపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం

సీకేదిన్నె, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆజాద్‌నగర్ వద్ద ఊటుకూరు సర్కిల్ వైపు వరిగడ్డితో వస్తున్న ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి టిప్పర్ ఢీకొనడంతో ట్రాక్టర్ పల్టీకొట్టింది. దీంతో వరిగడ్డి రోడ్డుపై పడిపోయింది. అయితే ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్, టిప్పర్ డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.

ఉపాధి పథకంలో అక్రమాలు, అవినీతి

● కలెక్టర్‌కు లేఖ రాసిన ఎంపీ అవినాష్‌రెడ్డి

పులివెందుల, మే 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథ కంలో భారీ అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. జిల్లాలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి ఎంపీ లేఖ రాశారు. అందులో ఒకే ఫొటోతో అనేక పేర్లతో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. ఎప్పుడు అమలు చేయని పనులకు నకిలీ పత్రాల ఆధారంగా వేతన చెల్లింపులు జరిగాయన్నారు. అలాగే విదేశాలలో నివసిస్తున్న వారి పేర్లు కూడా మస్టర్‌లో చేర్చడం, పని జరగకున్నా, ఖాళీ మస్టర్‌లలో సంతకం చేయాలని కార్మికులను బలవంత పెడుతున్నారన్నారు. పులివెందుల నియోజక వర్గంలోని చక్రాయపేట మండలంలోని కుప్పం పంచాయతీలో నకిలీ ఎంట్రీలు, ఒకే కార్మికుడి ఫొటోలను పదేపదే ఉపయోగించారన్నారు. జిలాస్థాయి విచారణను ప్రారంభించాలని, రాజకీయ బలంతో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతలు స్వీకరణ



కడప ఎన్జీఆర్ సర్కిల్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ పీడీ)గా డాక్టర్ రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వపు పీడీ ఆనంద్‌నాయక్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఆనందనాయక్ పదోన్నతిపై తన మాతృశాఖకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇన్‌చార్జ్ పీడీగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మిని నియమించారు. దీంతో ఆమె బాధ్యతలను స్వీకరించారు. ఏపీడీ ప్రసాద్, సిబ్బంది నూతన పీడీకి ఘన స్వాగతం పలికారు.

ఆర్టీపీపీ సీఈగా వాసుదేవరావు



ఆర్టీపీపీ సీఈకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఈలు

ఎర్రగుంట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంవీఆర్ఆర్ ఆర్టీపీపీ చీఫ్ ఇంజినీర్‌గా జి.వాసుదేవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. సీఈగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్థానిక ఎస్ఈలు సోమశేఖర్‌రెడ్డి, క్రిష్ణమోహన్, ఇతర అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న గౌరీపతి విద్యుత్ సౌధకు బదిలీపై వెళ్లారు. కొత్త సీఈకి స్వాగతం, పాత సీఈకి వీడ్కోలు తెలుపుతూ సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు ప్రసంగించారు.

గండికోట ప్రాజెక్టులో తగ్గుతున్న నీటిమట్టం

కొండాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతూ వస్తోంది. ఎండాకాలం కావడం, ప్రాజెక్టు నుంచి అనుబంధ రిజర్వాయర్లకు నీరు విడుదల చేస్తుండటంతో నీటిమట్టం తగ్గుతోంది. ప్రస్తుతం జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, తాగునీటి స్కీమ్‌కు 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ఏమీ లేదన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17.58 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

కడప-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ పనులను పునఃప్రారంభించాలి

వేంపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ పనులను రైల్వేశాఖ వెంటనే పునఃప్రారంభించేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి కోరారు. రైల్వేలైన్ విషయంపై తులసిరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బుధవారం బహిరంగ లేఖ రాశారు. 2008-09లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందన్నారు. మొదటిదశలో కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలోమీటర్ల పని పూర్తి అయ్యిందన్నారు. 2019లో వైసీపీ అధికారం వచ్చాక పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పునరాలోచించి కడప-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గానికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్, ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా

● ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు

● పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చింద న్నారు. వీరితోపాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీ పరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

పంచాయతీ కార్మికులకు రూ.10వేలు అడ్వాన్స్


డీఎల్‌పీఓకు రూ.10లక్షలు అందిస్తున్న సర్పంచు ఆర్.శ్రీను

వేంపల్లె, మే 14 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య, నీటి సరఫరా, గ్రీన్ అంబాసిడర్లకు రూ.10వేలు అడ్వాన్స్‌ను పులివెందుల డీఎల్‌పీఓ రమాదేవి పంపిణీ చేశారు. ఐదు నెలలుగా వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారు. ఈఓ సెలవులో ఉన్నకారణంగా పంచాయతీ నిధులు డ్రా చేసి కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉండడంతో సర్పంచు ఆర్.శ్రీను సొంత డబ్బు రూ.10లక్షలు డీఎల్‌పీఓ రమాదేవికి అందజేయగా ఆమె కార్మికులకు అడ్వాన్స్ రూపంలో ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున 103 మంది కార్మికులకు బుధవారం పంపిణీ చేశారు. ఈఓ వచ్చిన తర్వాత పూర్తినెలల వేతనం పంపిణీ చేస్తామని కార్మికులకు తెలిపారు.

మంత్రిని కలిసిన పార్థసారథిరెడ్డి

వేముల, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి కలిశారు. బుధవారం మంగళ గిరిలోని మంత్రి చాంబర్‌లో కలిసి పలు సమస్యలను విన్నవించారు. ట్రిపుల్‌ఐటీ, జేఎన్టీయూ ఉద్యోగాల విషయాలతో పాటు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి త్వరలోనే వీటికి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు పార్థసారథిరెడ్డి తెలిపారు.

కుక్కలతో పిక్కలు జాగ్రత్త..!

పులివెందుల పట్టణ, గ్రామాల్లో కుక్కల బెడద ● చిన్నారులు, కొత్త వ్యక్తులపై దాడి
పట్టించుకోని మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులు ● ఆందోళనలో ప్రజలు


పులివెందులలో జీపు స్టాండు వద్ద గుంపులు, గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పులివెందుల టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పులివెందులతో పాటు మండల వ్యాప్తంగా కుక్కల బెడదతో ప్రజలు భయపడుతున్నారు. వీధికుక్కలను తరలించాల్సిన మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వీటి సంతతి వృద్ధి చెందింది. రహదారుల మధ్యలో తిష్ఠ వేసి వాహనాల చోదకులు, పాదచారులపై దాడులు చేస్తున్నాయి.

పులివెందుల పట్టణ, గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులు వీటి నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడంతో కుక్కల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఏ వీధిలో చూసినా మందలు మందలుగా తిరుగుతున్నాయి. దీంతో వీధుల్లో ఒంటరిగా వెళ్లాలంటే పిల్లలు, మహిళలు భయపడుతున్నారు. ఇక రాత్రుళ్లు చెప్పాల్సిన అవసరం లేదు.

ఇటీవల పలువురిపై దాడి..: కుక్కలు పులివెందుల మండలంలో ఇటీవల పలువురిపై దాడి చేశాయి. కుక్కకాటుతో ఆసుపత్రికి వెళుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది. గత వారంలో ఎర్రిపల్లె గ్రామంలో కుక్కలు ఒకే రోజు ఆరుగురిని కరిచిన విషయం తెలిసిందే. పులివెందులలో సైతం పలువురికి కుక్కలు కాటు వేయడంతో పట్టణంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

చర్యలేవీ..? : వీధికుక్కలను పట్టుకుని వాటిని తరలించాలి. కనీసం వాటి సంతానం వృద్ధి కాకుండా శస్త్ర చికిత్స చేయాలి. అయితే మున్సిపాలిటీ, మండలంలో ఇవి అమలు కావడం లేదని తెలుస్తోంది. వీటి నియంత్రణకు మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమ య్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని అచ్చివెల్లి, ఎర్రిపల్లె, నల్లపురెడ్డిపల్లె, ఎర్రబెల్ల, కొత్తపల్లెలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి నిత్యం అనేక మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారు.

గతంలో సర్పంచ్‌లు కుక్కల నియంత్రణకు చర్య లు తీసుకున్నారని ఇప్పుడు అధికారులు పట్టించు కోకపోవడంతో ఈ పరిస్థితిఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుక్కల పెంపకానికి అనుమతి తప్పనిసరి

ఇళ్లల్లో కుక్కలను పెంచుకోవాలంటే తప్పకుండా మున్సిపాలిటీ, పంచాయతీ అనుమతులు పొందాల్సి ఉంది. అయితే చాలా మంది ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కుక్కలను పెంచుతున్నారు. అలాగే వీధికుక్కలను అదుపు చేసే వారు లేకపోవడంతో అవి విచ్చలవిడిగా వీధుల్లో తిరుగుతూ మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయి. పెంపుడు కుక్కల కంటే వీధికుక్కలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీ, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో వీటికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. వాహనదారుల వెంట పడుతూ కరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. అలాగే పాదచారులనూ వదలడంలేదు.

త్వరలో పరిష్కరిస్తాం



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల సమస్య త్వరలోనే పరిష్కరిస్తాం. కుక్కల సంతానం ఉత్పత్తి కాకుండా ఇంజక్షన్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. కుక్కలను పట్టే వారిని పిలిపించి కుక్కల నియంత్రణక కృషి చేస్తాం

రాముడు, మున్సిపల్ కమిషనరు

దాడులు చేస్తున్నాయి



వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. రోడ్డుపై నడవాలంటేనే భయం వేస్తుంది. గుంపులుగా ఉంటూ దాడులు చేస్తున్నాయి. గతంలో కూడా వీధుల్లో పలువురిని కుక్కలు కరవగా ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

మహేశ్వర్‌రెడ్డి, పులివెందుల

రాత్రుళ్లు రోడ్లపై తిరగాలంటే భయం



రాత్రి 8 అయిందంటే వీధి కుక్కల బెడద ఎక్కువైంది. మందలు, మందలుగా తిరుగు తూ దాడులు చేస్తున్నాయి. పం చాయతీ అధికారులు పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి.

జనార్దనరెడ్డి, అచ్చెవెల్లి

వైభవంగా మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



పుట్ట మట్టిని తీసుకెళుతున్న ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు

కడప కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో బుధవారం నగర అమ్మవారిశాలవీధిలో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్స వాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఉదయం అమ్మవారి ఆలయంలో గోపూజ, గణపతిపూజ, శత చండీ పారా యణం, శ్రీ లక్ష్మి గణపతి హోమం, మహాలింగార్చన, వేద పారా యణం, శ్రీనగరేశ్వర స్వామికి అలాగే శ్రీ కోదండరామస్వామి వారికి విశేష అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం అంకురారోహణం, లక్ష కుంకుమార్చన, వేద పారాయణం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అంకురారోహణం కార్యక్రమానికి కడ ప తహసీల్దార్ కార్యాలయం వద్ద గల పుట్ట నుంచి మట్టిని తీసు కెళ్లారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులపై కడప డిపో అధికారుల తీరుమారాలి

కడప మారుతీనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై (కండక్టర్లు....డ్రైవర్లు) సంబంధిత డిపో అసిస్టెంట్ మేనేజర్, టి.ఐ-3 పనిగట్టుకుని మరీ కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం పద్ధతిగా లేదని, తక్షణమే వారి తీరు మార్చుకోవాలని ఆర్టీసీ కడప డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి సగినాల శ్రీనివాసులు కోరారు. ఇందుకు నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తొలి సర్వీస్ నుంచి ఎర్ర బ్యాడ్జీలు ధరించి పలువురు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ కడప డిపో కోశాధికారి పి.ఎస్.ఖాన్, కె.ఎం.ఎస్.రావు, రామయ్య, రాజేశ్వరీ, కె.ఎస్.దాస్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... నిత్యకల్యాణమూర్తుల బ్రహ్మోత్సవాలు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

కమలాపురం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): వార్షిక బ్రహ్మో త్సవాల్లో రోజుకో వాహన సేవలో మోక్ష నారాయణ స్వామి శ్రీరామా పురం క్షేత్రం లో దర్శనమి చ్చారు. పుణ్య భూమి చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, ఆలయ నిర్వాహకుడు కాశీభట్ల సత్యసాయినాథ్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన బ్రహ్మోత్సవాలు, బుధవారం ఉదయం నుంచి మండప అర్చనలు, పూజలు, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. రాత్రి అంగరంగ వైభవంగా గరుడ, మయూర వాహనంపై గ్రామోత్సవం ఆలయ మాడవీధుల్లో ఘనంగా సాగింది. కాగా సత్య సాయినాథ్‌శర్మ న్యూకేటగిరి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురాంరెడ్డి దంపతులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. కాగా మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

పులివెందుల రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలకు సమ్మెల ద్వారా కట్టడి చేయాలని సీఐటీయూ నాయకులు గఫూర్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమ్మెనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


దుప్పట్లు, టవళ్లు పంపిణీ

కడప కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పిల్లల పట్ల ప్రేమానురాగాలు చూపడంలోనే కాకుండా పెద్దలను గౌరవించాలనే ఆలోచనలు, దైవభక్తి, క్రమశిక్షణ తదితర అంశాలను వారికి తెలియపరచడంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి. మహేష్ సూచించారు. పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత... ఆధ్యాత్మిక సదస్సు అనే అంశంపై న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక 48వ డివిజన్ కృపా కాలనీలోని చర్చినందు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సులో పిల్లల తల్లిదండ్రులకు దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు.

చిన్నారుల మృతి బాధాకరం

కడప,కలెక్టరేట్, మే 14 (ఆంధ్ర జ్యోతి): బ్రహ్మంగారి మఠం మండలం, మల్లేపల్లి చెరువులో ఈతకెళ్లి ఐదు గురు చిన్నారులు మృతి చెందడం బాధాకరమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో ఈతకు వెళ్లి మృత్యువాత పడటం అత్యంత బాధాకరమన్నారు. ఆ కుటుంబాల్లో శాంతి నెలకొనాలనీ,మృతుల కుటుం బాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

వ్యక్తి మిస్సింగ్ కేసు నమోదు


పెద్ద కుళ్లాయప్ప

సింహాద్రిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామానికి చెందిన భుక్యాపురం పెద్ద కుళ్లాయప్ప (59) అనే వ్యక్తి కనిపించక పోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి కుమార్ తెలిపారు. కాగా కుళ్లాయప్ప మూగ, చెవిటివాడు. ఇతను తన ఇంటి నుంచి కొన్ని రోజుల క్రితం వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. దీంతో అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు పీఎస్-9121100613, సర్కిల్- 9121100549 నెంబర్లకు ఫోన్ ద్వారా తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి

సింహాద్రిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల సాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన అధికారుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ, ప్రభుత్వం హార్టీకల్చర్ హబ్‌గా చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ నెల 16, 23వ తేదీలలో జరిగే గ్రామ సభలలో ఉపాధి ,ఉద్యాన శాఖ వారి సమన్వయంతో 25 రకాల పంటలు వేసుకునే రైతుల వివరాలు సేకరించడంతో పాటు వారికి ఉద్యాన పంటలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ శివమోహన్‌రెడ్డి, ఏపీఓ జయభారతి, అధికారులు పాల్గొన్నారు.

క్లాప్‌మిత్రలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం


సేఫ్టీ కిట్స్ అందిస్తున్న దృశ్యం

చెన్నూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులు (క్లాప్‌మిత్ర) ఆరోగ్యంగా ఉండాలాన్నదే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ ఎంపీడీఓ జి.సురేశ్‌బాబు అన్నారు. బుధవారం చెన్నూరు గ్రామ పంచాయతీలోని క్లాప్ మిత్రలకు సేఫ్టీ కిట్స్‌ను అందించారు. ఈ సేఫ్టీ కిట్స్‌లో ఉన్న గ్లౌజ్, మాస్కులు, శానిటైజర్లు పలు రకాల వస్తువులు నిత్యం వాడు కోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సర్పంచ్ ఎస్.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన బీటెక్ రవి



పులివెందుల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసన సభ డిప్యూటీ స్పీకర్, ఉండి నియోజకవర్గ శాసనసభ్యుడు రఘురామకృష్ణంరాజుకు పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో జన్మదినం జరుపు కొంటున్న రఘురామకృష్ణం రాజును బీటెక్ రవి కలిశారు. నిండునూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని బీటెక్ రవి కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా చైన్‌స్నాచింగ్, చిన్న చిన్న దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక గణేశ్‌పురం వల్లూరు వద్ద కమలాపురం, వల్లూరు ఎస్ఐలు విద్యాసాగర్, పెద్దఓబన్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు ప్రజలతో మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు కానీ, కొత్తవారుకానీ గ్రామంలోకి వస్తే తక్షణం తమకు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం నాకాబందీ నిర్వహించారు.

అధ్వానంగా స్త్రీ శక్తి భవనం

● పట్టుమని పది సంవత్సరాలకే పెచ్చులూడిన వైనం





పెండ్లిమర్రి, మే 14 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2011 సంవత్సరంలో భారత్ నిర్మాణ్ రాజీవ్ గాంధీ సేవా కేంద్రం పథకం ద్వారా స్త్రీశక్తి భవనం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.మొత్తం 30 లక్షల రూపాయల నిధులతో మార్చి 2014 సంవత్సరంలో అప్పటి ప్రజా ప్రతినిధులు స్త్రీ శక్తి భవనాన్ని ప్రారంభించారు. కాగా ఈ భవనం స్లాబు పెచ్చులూడి,ఫ్లోరింగ్ పాడై,గోడలు నెర్రెలు చీలి మొత్తంగా భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇక వానాకాలం వచ్చిందంటే ఉద్యోగులకు నరక యాతనే. వానాకాలంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి పెను ప్రమాదం తప్పింది.

కీటక జనిత వ్యాధుల పట్ల అవగాహన

సీకేదిన్నె, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కీటక జని త వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మ లేరియా జోనల్ అధికారి డాక్టర్ లక్ష్మన్‌నాయక్ తెలి పారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శిం చారు.రక్తపరీక్షల విభాగాన్ని, రికార్డులు తనిఖీ చేశా రు. వైద్యాధికారులు రాఘవేంద్ర, సునీత, సీహెచ్‌వో సుకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రేడ్-3గా జమ్మలమడుగు మున్సిపాలిటీ

జమ్మలమడుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నగర పంచాయతీ గ్రేడ్-3 మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. జమ్మలమడుగు గ్రామ పంచాయతీని 40,540 జనాభాతో 2005లో నగర పంచాయతీ చేశారు. అలాగే జీవోఎంఎస్ నెం.84, తేది 14.5.2025న 55,743 జనాభాతో నగర పంచాయతీ నుండి గ్రేడ్-3 మున్సిపాలిటీగా చేసినట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. దీంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పెరిగే అవకాశం ఉందని స్థానికులు చెప్పుకోవడం విశేషం. అదేవిధంగా పన్నులు కూడా పెరుగుతాయని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు కట్టా వర్ధంతి

మైదుకూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, విద్వాన్ కట్టా నరసింహులు వర్ధంతిని ఈనెల 15వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ తెలిపారు. స్థానిక కడప రోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సాయంత్రం ఈ వేడుక జరుగుతుందని, అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

తవ్వకాలను పరిశీలించిన అధికారులు



అధికారుల రాకతో వెనుతిరిగిన టిప్పర్లు

దువ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): క్రిస్తురాజపురం సమీప గుట్టలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను బుధవారం భూగర్భగనుల శాఖ అధికారులు పరిశీలించారు. గనులు, భూగర్భశాఖకు సంబందించిన డిప్యూటీ డైరెక్టర్ వై.రాధా, విజిలెన్స్ అధికారి జి.కృష్ణమూర్తి, సిబ్బందితో పాటు స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జాన్సన్, సర్వేయర్లు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. తవ్విన గ్రావెల్ విస్తీర్ణాన్ని వాకబు చేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మట్టి లూటీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన గనులు, భూగర్భ శాఖ అధికార బృందం ఇక్కడకు వచ్చింది. అధికారులు రాగానే అక్కడున్న ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు ఒక్కొక్కటిగా వెనుతిరిగాయి. అధికారులు అక్కడే ఉన్న ఒక కంపెనీ ప్రతినిధితో మాట్లాడారు. అనంతరం ఓ అధికారి కృష్ణమూర్తి మాట్లాడుతూ రోడ్డు పక్కన, సమీపంలో ఉన్న జమ్మిచెట్టు ప్రాంత తవ్వకాలకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మొదట్లో చేసిన తవ్వకాలకు, ఇతర అనుమతులకు వివిధ రూపాల్లో రూ.1,05,30,000 విడతల వారీగా ప్రభుత్వ రాయల్టీ వసూలు చేసినట్లు ఆయన వివరించారు.

19న గోపవరం ఉపసర్పంచ్ ఎంపిక

ప్రొద్దుటూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఈనెల 19న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ బుధవారం తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ నుంచి నోటిఫికేషన్ విడుదలైందని చెప్పారు. ఎన్నికల అధికారిగా మైలవరం మండలం డిప్యూటీ ఎంపీడీవో వై.రామచంద్రారెడ్డిని నియమించారన్నారు. పంచాయతీ పరిధిలో మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉన్నారు. వీరిలో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకోవాల్సి ఉంది. గత మార్చి 27న నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల నేపథ్యంలో, కోరం లేకపోవడంతో అధికారులు ఎన్నికను మరుసటి రోజుకు వాయిదా వేసిన విషయం తెలిసిందే. 28వ తేదీన గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక చేపట్టగా ఎన్నిక కేంద్రంలో వార్డు సభ్యుల మధ్య గతంలో కుదుర్చుకున్న ఒప్పంద వ్యవహారమై వాగ్వాదం చేసుకోవడంతో ఎన్నికల నిర్వహణ అధికారి అస్వస్థతకు లోనవడంతో రెండోసారి ఎన్నిక వాయిదా పడింది. దీంతో ఉప సర్పంచ్ ఎన్నికకు బ్రేక్ పడినట్లు అయింది. ప్రస్తుతం ఈ ఎన్నిక ఈనెల 19వ తేదీన నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో పంచాయతీ అధికారులు ఉప సర్పంచ్ ఎన్నిక పనుల్లో నిమగ్నమవుతున్నారు.

కౌన్సిలర్ రాజీనామా



రాజీనామాను కమిషనర్‌కు అందిస్తున్న కౌన్సిలర్

ఎర్రగుంట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగర పంచాయతీ 13వ వార్డు కౌన్సిలర్ షేక్ కలిమున్నీసా తన పదవికి రాజీనామా చేశారు. 2021లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీచేసి గెలిచారు. తమకు ప్రాధాన్యత లేని కౌన్సిల్‌లో ఉండటం దండగ అని తన భర్త వైసీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు కోకోకోలా గౌస్‌తో కలిసి బుధవారం ఆమె రాజీనామా పత్రాన్ని కమిషనర్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి అరగంట ముందు కలిమున్నీసా రాజీనామా ఇచ్చారని, వచ్చే సమావేశంలో కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి నిర్ణయం మేరకు ముందు కెళ్తామని, రాజీనామాను ఆమోదిస్తే ఎన్నికల్ కమిషనర్‌కు పంపుతామని ఆయన తెలిపారు.

హనుమంత వాహనంపై శ్రీవారు



జమ్మలమడుగు, మే 14 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత నారాపురం వెంకటేశ్వరస్వామిని కల్పవృక్ష వాహనంలో ఊరేగించారు. అనంతరం ఆలయంలో స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు ముందు భక్తులు కోలాటం నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



నూతనంగా ప్రతిష్ఠించిన లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

అట్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంభగిరి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నూతనంగా ఆలయ నిర్మాణం చేపట్టి ప్రతిష్ఠా మహోత్సవాలను సోమవారం నుండి ప్రారంభించారు. బుధవారం వరకు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు బొజ్జ రోశన్న, డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, మునిరెడ్డి, పాలకొండ రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, క్రిష్ణారెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, పాటూరు రాధాక్రిష్ణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అజ్ఞానం నుండి వెలుగు వైపు ప్రయాణించాలి

● త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం

బి.కోడూరు, మే 14(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి అనునది దైవజ్ఞానానికి ప్రతీక అని, అమ్మవాస్య అజ్ఞానానికి గుర్తుగా ఉన్నదని, కావున అజ్ఞానం నుండి వెలుగు వైపునకు ప్రయాణించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని అక్కుపాలెం, రామసముద్రం, ఆనంవారిపల్లె, బి.కోడూరు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమావాస్యకు, పౌర్ణమికి మధ్య అష్టమి రోజున జన్మించాడని, జ్ఞానం, అజ్ఞానానికి మధ్య వారధిగా కృష్ణుడు ఆవిర్భవించాడన్నారు. కాబట్టి కృష్ణుడిని పూర్తిగా విశ్వసిస్తే మోక్షం పొందుతారన్నారు. కార్యక్రమంలో సేవా సమితి కంభం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బంతులు పంపిణీ

బద్వేలు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): వెటరన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోటవీధిలో నిర్వహిస్తున్న క్రికెట్ సమ్మర్ క్యాంపులోని క్రికెట్ క్రీడాకారులకు బుధవారం క్రికెట్ బంతులు. కూల్ డ్రింక్స్‌ను అందించారు. ఈ సందర్భంగా వెటరన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గానుగపెంట రమేశ్‌బాబు, ఉపాధ్యక్షులు పెద్ది సుధాకర్, నారాయణ మాట్లాడుతూ బద్వేలులో ఇంతవరకు క్రీడా మైదానం లేదని, ప్రభుత్వం మైదానం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరుకు రూ.101 కోట్ల నిధులు మంజూరు

మైదుకూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి రూ.101 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. మున్సిపల్ డెవలప్మెంట్, అర్బన్ అథారిటీ విడుదల చేసిన జీవోలో అమృత్ 2.0 పథకం ద్వారా మైదుకూరు మున్సిపాలిటీ తాగునీటి కోసం రూ.99.70 కోట్లు, శెట్టివారిపల్లె చెరువు ఆధునీకరణకు రూ.2.2 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఫోన్‌లో తెలిపారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు పేర్కొన్నారు. బుధవారం వసంతపేట మున్సిపల్ హైస్కూలులో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పుడు నైతిక విలువలను పాటించాలని, ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాతమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించాలి

ప్రొద్దుటూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో ఎన్‌రోల్‌మెంట్ చేసే దిశగా సర్వే చేస్తున్నట్లు భవిత కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయులు సంగీత, లక్ష్మిరెడ్డి తెలిపారు. బుధవారం సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వే వలన బడి బయట పిల్లలను బడిలో చేర్చడం, వారికి ఏ విధమైన సౌకర్యాలు అవసరమో గుర్తించి ఈ కేంద్రంలో వారానికి ఒక రోజు ఫిజియోథెరపి కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

క్రైస్తవులకు అండగా సీఎం చంద్రబాబు

ప్రొద్దుటూరు, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రైస్తవులకు సీఎం చంద్రబాబు అండగా నిలిచారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు అన్నారు. పెండింగ్‌లో వున్న పాస్టర్ల ఏడు నెలల వేతనాన్ని విడుదల చేసినందుకు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, జయకుమార్, శ్యామ్, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మృతి బాధాకరం

● ఎస్టీయూ రమణారెడ్డి

పోరుమామిళ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈతకు వెళ్లి చెరువులో మునిగి ఐదుగురు విద్యార్థులు చనిపోవడం బాధాకరమని, వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి తెలిపారు. బుధవారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో చనిపోయిన చరణ్, పార్దు, హర్ష, దీక్షిత్, తరుణ్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20లక్షల తక్షణ సాయం అందించాలన్నారు. ఆయా కుటుంబాల్లోని మిగిలిన పిల్లల ఉన్నత చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు కూడా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడికి వెళతున్నారరు, ఎవరితో వెళుతున్నారు. ఎలా వెళుతున్నారన్న విషయాలు గవనించాలన్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో ఇలాంటి దుర్ఘటనల కారణంగా అభం శుభం తెలియని చాలామంది పిల్లల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయన్నారు. ప్రభుత్వం కూడా ఇలాంటి గ్రామాల సమీపాల్లో ఉండే చెరవువులపై ప్రత్యేక దృష్టి సారించి చెరువు చుట్టూ ముళ్ల కంచె లేదా కాపలా మనుషులను ఏర్పాటు చేయాలని సూచించారు.

వ్యక్తికి గాయాలు

బ్రహ్మంగారిమఠం, మే 14 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల పంచాయతీ టి.రామాపురం జాతీయరహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. మైదుకూరు వైపు నుండి నెల్లూరు జిల్లా సంగం వెళుతున్న టాటా ఏస్ గూడ్సు వాహనాన్ని బద్వేలు వైపు నుండి వస్తున్న బొగ్గు లారీ అదుపు తప్పి ఎదురుగా ఢీకొనడంతో టాటాఏస్ డ్రైవరు సాంబశివయ్య (43) కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ సాంబయ్యను స్థానికులు 108వాహనంలో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం కడపరిమ్స్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి బి.మఠం పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఆలయాల్లో చోరీలు

కలసపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలం ఎగువ రామాపురం బస్టాండ్ వద్ద ఉన్న శివాలయం, పాత రామాపురంలోని అభయాంజనేయస్వామి దేవాలయాల్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడ్డారు. శివాలయంలోని హుండీని పగులగొట్టి నగదును దొంగలించారు. అలాగే ఆంజనేయస్వామి గుడిలోని హుండీని పొలాల్లోకి తీసుకుపోయి పంగులగొట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వీరి ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ఆలయాలను పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ తిమోతి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పోరుమామిళ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో, మసీదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో దేవాలయ కమిటీ, మసీదు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే దేవాలయాలు, మసీదుల్లో ఉన్న హుండీల విషయంలో కూడా కమిటీ సభ్యులు బాధ్యతగా తీసుకోవాలన్నారు.

ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలి

ఎర్రగుంట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో పంచాయతీ కార్యదర్శులకు, అగ్రికల్చరల్, హార్టికల్చరల్ సహాయకులకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా వీటిపై రైతులకు ఎక్కువ అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీన సచివాలయాల్లో ప్రత్యేక గ్రామ సభలను ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను సేకరించి వారికి తగిన సూచనలు ఇవ్వాలన్నారు.

పండ్లతోటల పెంపకందారులను గుర్తించండి

దువ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటలు సాగు చేసే పెంపకందారులను గుర్తించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో హరికృష్ణ తెలిపారు. దువ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రైతుసేవా కేంద్రం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. అయిదు ఎకరాలలోపు ఉండే రైతులకు ఉపాధి హామీ పథకం కింద మొక్కలు ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. అయిదు ఎకరాలకుపైగా సాగు చేయాలనుకుంటే హార్టికల్చలర్ అధికారులు ఉచితంగా మొక్కలు అందిస్తారన్నారు. సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు ఉపాధి హామీ పథకం అధికారి కె.లక్ష్మినారాయణ, ఈసీ ఇందిరప్రియాంక పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి నూరు శాతం సబ్సిడీ

పోరుమామిళ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఉద్యానశాఖ ద్వారా వంద శాతం సబ్సిడీతో పండ్లతోటలు పెంపకం చేసుకోవ్చని ఏపీవో రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో రమణారెడ్డి, వ్యవసాయాధికారి వరహరికుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండ్లతోటలు పెంచుకునేందుకు ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులను గుర్తించేందుకు ఈనెల 16న అన్ని గ్రామ సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో పిల్లల కథా వర్క్‌షాప్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో కథా రచనల్లో సృజనాత్మకతను పెంచడానికి ఈనెల 24, 25 తేదీల్లో నంది ని క్లాత్‌మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో పిల్లల కథా వర్క్‌షాప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ ఉపాధ్యక్షుడు వేంపల్లె రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక జేవీవీ కార్యాలయంలో పిల్లల కథా వర్క్‌షాప్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో 16 సంవత్సరాలలోపు పిల్లలకు కథలు ఎలా రాయాలి, ఏయే అంశాలు కథలో ఉండాలి, కథలు రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి అన్న అంశాలపై బాల సాహిత్య రచయితలు మెలకువలు నేర్పుతారని తెలిపారు. ఆసక్తి ఉన్న పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. వర్క్‌షాపులో పాల్గొనే పిల్లలు జేవీవీ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కవి మహమూద్, జేవీవీ జిల్లా గౌరవ సలహాదారు గోపీనాథరెడ్డి, ఈశ్వరయ్య, మధుసూదన్‌రెడ్డి, దేవానంద్, శిరీష, హసిని, గురు చందన, జుబేద, భరత్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రూ.10కోట్ల పనులకు ప్రతిపాదనలు



మాట్లాడుతున్న కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలో రూ.10కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు కౌన్సిల్ సమావేశంలో అధికారులు వెల్లడించారు. నగరపంచాయతీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు సుమారు రూ.3కోట్ల పనులు నిర్వహించినట్లు అజెండాలో చదివారు. అనంతరం ప్రతి సంవత్సరం పన్నులు భారీగా పెంచుతున్నారని, ఇది ప్రజలకు మోయలేని భారంగా మారిందని 17వ వార్డు కౌన్సిలర్ ఎరుకలరెడ్డి, పాచిపట్టి ఉన్న ట్యాంకులను వెంటనే శుభ్రం చేయించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని 19వ వార్డు కౌన్సిలర్ సానేపల్లి లక్ష్మీఈశ్వరి అధికారులను కోరారు. కార్యక్రమంలో కమిషనర్ శేషఫణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ సీనియర్ నాయకుడి మృతి

బి.కోడూరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమ్మవారిపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చాటకొండు చిన్నమద్దెయ్య (62) ఇటీవల అనారోగ్యానికి గురై మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృతదేహానికి బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, ఎర్రకేశవ తదితరులు పాల్గొన్నారు.

పార్కును ఏర్పాటు చేయడం అభినందనీయం

అట్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగంపల్లె కాలనీలో టీడీపీ నాయకుడు, ఎన్ఆర్ఐ పాలకొండ రాజశేఖర్‌రెడ్డి సుందరమైన పార్కును ఏర్పాటు చేయడం అభినందనీయమని బద్వేలు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రంగంపల్లె కాలనీలో ఏర్పాటు చేసిన పార్కును, ఉచిత మినరల్ వాటర్‌ప్లాంటును ఆయన, బీజేపీ నాయకుడు బొజ్జా రోశన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పది వాటర్ ప్లాంట్లు పలు అభివృద్ధి కార్యక్రమాలకు టీడీపీ నాయకులు ముందుకు వచ్చి తమ సొంత నిధులతో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, మునిరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, జయక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న రితీష్‌రెడ్డి